యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

- అంగళ్లు, హోటళ్లలో జోరుగా ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- నిషేధిత కవర్ల వాడకంతో పర్యావరణానికి ముప్పు


రొళ్లలో ప్లాస్టిక్ కవర్లను దిబ్బగా వేసిన దృశ్యం

రొళ్ల: మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మానవాళి మనుగడ, పర్యావరణానికి ముప్పుగా పరిగణించిన 40 మైక్రాన్ల మందం కంటే తక్కువ ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. అయితే ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తమకేమీ పట్టనట్లు చూస్తుండటంతో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, స్వచ్ఛ భారత్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు.. పర్యావరణానికి ఆటంకంగా మారిన నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వాడకంపై మాత్రం పట్టించుకోక పోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మృత్యువాత పడుతున్న పశువులు

నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల పరిధిలోని దాదాపు 365 గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. దీనికి తోడు ప్రతి గురువారం రొళ్ల, మడకశిర, ఆదివారం అగళి, బుధవారం గుడిబండ, శుక్రవారం అమరాపురం మండలాల్లో పెద్ద ఎత్తున వారపు సంత మార్కెట్ జరుగుతుంది. వందలాది మంది వ్యాపారులు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, వారపు సంతలో విచ్చలవిడిగా 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ పేపర్లు విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారస్తులు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు తీసుకుచ్చి దుకాణాలకు విక్రయిస్తున్నారు. దీంతో అన్ని మండలాల్లో ఎక్కడ చూసినా చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్ పేపర్లు దర్శనమిస్తున్నాయి. ఈ ప్లాస్టిక్ పేపర్లు తిని పశువులు, ఇతర పెంపుడు జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలాల వారీగా వివిధ దుకాణాల సంఖ్య	
రొళ్ల	113
అగళి	102
గుడిబండ	118
అమరాపురం	355
మడకశిర	970

కొరవడిన అవగాహన

మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా జ్యూట్, పేపర్ బ్యాగులు, ఇతర వస్తువులు అందుబాటులో ఉన్నాయి. మున్సిపాలిటీ, పంచాయతీ స్థాయి అధికారులు వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో కలిగే నష్టాలను క్షేత్రస్థాయిలో వివరించాలి. ప్రత్యామ్నాయ కవర్ల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలి. అయితే అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోక పోవడంతో ప్లాస్టిక్ వాడకం రోజు రోజుకు పెరిగిపోతోంది.

నిషేధిత కవర్లు విక్రయిస్తే చర్యలు

40 మైక్రాన్ల మందం కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు వాడితే పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. రొళ్ల మండలంతో పాటు గ్రామాల్లోని దుకాణాల్లో నిషేధిత కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. దుకాణాలను సీజ్ చేస్తాం. దుకాణాల్లో ఎక్కడైనా ప్లాస్టిక్ పేపర్లు విక్రయిస్తే ప్రజలు నిర్భయంగా అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– శ్రీనాథ్, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ, రొళ్ల మండలం

అధికారులు జోక్యం చేసుకోవాలి

దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పంచాయితీ అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. 40 మైక్రాన్ల మందం కంటే తక్కువ మందం ఉన్న కవర్లు అమ్మకాలు సాగిస్తే అధికారులు చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో భవిష్యత్తులో మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది.

– రవికుమార్, బీజీ హళ్లి గ్రామం, రొళ్ల మండలం

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం


నాయకులతో మాట్లాడుతున్న వేణురెడ్డి

చిలమత్తూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించుకుందామని వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయ ఆవరణలో ఆయన పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వైఎస్సార్ జయంతి సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎప్పటిలాగానే ఆయనకు ఘనంగా నివాళులర్పించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లోని వైఎస్సార్ విగ్రహాల వద్ద కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో అలజడి సృష్టిస్తే చర్యలు తప్పవు

లేపాక్షి: గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు, అలజడిని సృష్టిస్తే చర్యలు తప్పవని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ హెచ్చరించారు. శనివారం గోపిందేవరపల్లిలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేపట్టాఆరు. అనంతరం గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయరాదని, అలా ఎవరైనా చేస్తే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎస్‌ఐ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి


ఫ్యాక్టరీ కార్యాలయానికి సమ్మె నోటీసు అతికిస్తున్న నాయకులు

లేపాక్షి: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలంటూ శనివారం వారు పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు అందజేయడంతోపాటు పరిశ్రమల కార్యాలయాల వద్ద వాటిని అతికించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, మండల నాయకులు రామచంద్ర, కృష్ణమూర్తి, సదాశివారెడ్డి, నరసింహ, గోపాల్ పాల్గొన్నారు.

గుండుమల పంచాయతీలో నాకాబందీ


ఇంటి వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల గొల్లహట్టి, పీఎస్ తాండా గ్రామాల్లో శనివారం ఉదయం పోలీసులతో కలిసి సీఐ నగేష్ బాబు నాకాబందీ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ.. మాట్కా, జూదం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అక్రమ నాటుసారా, కర్ణాటక మద్యం అమ్మకాలను కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరూ కలసి మెలసి జీవనం సాగించాలన్నారు.

జపానంద సేవలు ఎనలేనివి


బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి జపానంద స్వామిజీ సేవలు ఎనలేనివని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ కొనియాడారు. శనివారం తాలూకాలోని కె.రాంపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కె.రాంపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 8 సంవత్సరాలుగా ఉచిత విద్యా సామాగ్రి అందిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఈఓ రేణుకమ్మ తదితర గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

'పీ4' అమలుపై మంత్రి సమీక్ష


మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: పీ4ను ఆచరణాత్మకంగా అమలు చేసే దిశగా బీసీ సంక్షేమ శాఖ, మంత్రి సవిత ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీ4 సర్వే ద్వారా నియోజకవర్గంలో అట్టడుగున ఉన్న 7,264 కుటుంబాలను గుర్తించామన్నారు. వారి సంక్షేమానికి కృషిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ స్వాతి, ఎంపీడీఓ నరేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అగళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పీ–4) సర్వేపై సమావేశం నిర్వహించారు. నియోజవర్గ స్పెషల్ ఆఫీసర్ సూర్యానారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు పీ–4 సర్వేపై వివరించాలని కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పరిగి: మండల కేంద్రంలో పార్వతమ్మ అనే వివాహిత అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. వివరాలు.. ఎర్రగుంట గ్రామానికి చెందిన పార్వతమ్మకు 2009లో హిందూపురం మండలంలోని బేవినహళ్లికి చెందిన నరసింహామూర్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గత కొన్ని రోజులుగా బేవినహళ్లిలో అత్తతో పార్వతమ్మకు విభేదాలు తలెత్తడంతో తరచూ గొడవలు జరిగాయి. ఈ క్రమంలో శనివారం అత్తతో గొడవ పడి ఇంట్లో నుంచి బయటకు వచ్చేసింది. విషయం తెలుసుకున్న భర్త నరసింహామూర్తి పరిగికి తీసుకొచ్చాడు. పార్వతమ్మ తండ్రి వెంకటరమణప్పను పరిగికి రమ్మని చెప్పి.. భార్య ఇంట్లో నుంచి బయటకు వచ్చిన విషయంపై చర్చించారు. అనంతరం వాష్‌రూమ్‌కు వెళ్లొస్తానని భర్త నరసింహామూర్తి, బజారుకు వెళ్లొస్తానని తండ్రి వెంకటరమణ చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సమయంలో పార్వతమ్మ అక్కడి నుంచి అదృశ్యమైంది. ఆటో ఎక్కి హిందూపురం వైపు వెళ్లినట్లు అక్కడున్న వారు తెలిపారని ఎస్‌ఐ తెలిపారు. తండ్రి వెంకటరమణప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఫుడ్ పాయిజన్


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న నాయకులు

సోమందేపల్లి: నాణ్యత లేని ఆహారం అందించడంతోనే కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ అన్నారు. మంత్రి సవిత నియోజకవర్గంలో ఇలాంటి ఘటన జరగడం బట్టి చూస్తే విద్యవ్యవస్థపై మంత్రికి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోందన్నారు. శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడారు. విద్యార్థుల క్షేమ సమాచారం కోసం వెళ్లిన తల్లిదండ్రులను అనుమతించకుండా.. గేట్లు మూసివేసి జిల్లా అధికారులు విచారణ జరపడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో సరైన వసతులు కల్పించడం లేదని, వాటికి తోడు నాసిరకపు ఆహార పదార్థాలు వంటలకు ఉపయోగిస్తుండడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఎస్ఓ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చక్రి, శ్యానిద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలి


పెనుకొండ ఆర్టీసీ డిపోలో ఆందోళన చేస్తున్న కార్మికులు

పెనుకొండ: ఆర్టీసీలో ఖాళీగా వున్న 10 వేల ఉదోగాలను వెంటనే నియామకం చేపట్టాలని ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర నాయకుడు బి. నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నాగార్జునరెడ్డితో పాటు రీజియనల్ నాయకులు పెద్దన్న, అంజినాయక్, డిపో సెక్రటరీ వెంకటేశులు, డిపో అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి సాయి వంశీ, అధ్యక్షులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్టీసీ కార్మికుల నిరసన

మడకశిర: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు రెండో రోజు శనివారం నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా ఈయూ నాయకులు మాట్లాడుతూ.. డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ అరియర్స్‌ను తక్షణమే చెల్లించాలన్నారు. విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించాలన్నారు. ఈ బస్సులను ఆర్టీసీ కార్మికులతోనే నడిపించాలని కోరారు. ఈయూ అధ్యక్షుడు రఫిక్, ప్రధాన కారద్యర్శి రంగనాథ్, గ్యారేజ్ కార్యదర్శి కేటీ స్వామి, డిపో ఈయూ నాయకులు గోపాల్, ప్రకాశ్ నాయుడు, ఈశ్వరప్ప, కళసప్ప, వెంకటేశ్, దాసప్ప, రమేష్, గౌస్‌పీర్, హుసేన్, నరసింహప్ప, గంగాధర్, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

హిందూపురం: ఆర్టీసీలో ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే ఇవ్వాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ స్వామి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డిపో ఎదుట ఈయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు బకాయిలతో 11వ పీఆర్సీ, అరియర్స్ చెల్లించడంతోపాటు 12వ పీఆర్సీని వెంటనే నియమించాలన్నారు. యూనియన్ నాయకులు విఘేశ్వర్, ఏవీవీ ప్రసాద్, ఈర్షదుల్లా తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి


ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

హిందూపురం టౌన్: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి కోరుతూ సీపీఐ నాయకులు పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద శనివారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ తాలుకా కార్యదర్శి వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజల పైన విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతోందన్నారు. వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, కార్యవర్గ సభ్యులు మారుతిరెడ్డి, జబీవుల్లా, సమివుల్లా, సమితి సభ్యులు నౌషద్, లింగప్ప, రహమతుల్లా, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ ఎన్నికల ముందు కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాదిలో నాలుగు దఫాలు చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, సీపీఐ మండల కార్యదర్శి రాజ్‌గోపాల్, నాయకులు నారాయణ స్వామి, గంగరాజు, ముబారక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డిపల్లిలో మొహర్రం వేడుకలు


పావగడలో కొలువుదీరిన పీర్లు

పెనుకొండ: వెంకటరెడ్డిపల్లిలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన వేడుకకు యువకులు పెద్దఎత్తున పాల్గొని అలావ్ అడారు. గ్రామానికి చెందిన ఎస్‌కే దాదాపీర్, అబ్దుల్ గఫూర్ సాబ్‌తో పాటు వారి వారసులు వేడుకలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఖాసీం సాబ్, బురాన్‌సాబ్ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి, గ్రామంలో ఊరేగించారు.

పీర్లకు చదివింపులు

అమరాపురం: మండల కేంద్రంలోని పాత మసీదు వద్ద రెండు చోట్ల మొహర్రం వేడుకలు కొనసాగుతున్నాయి. శనివారం పీర్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సాయంత్రం భక్తులు చక్కెర, బెల్లం, పప్పులు, బొరుగులను పీర్లకు చదివింపులు చేయించారు.

పావగడ: పట్టణంలోని బాబయ్య దేవాలయంలో మొహర్రం వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. భక్తులు పీర్ల దేవుళ్లకు పూజలు చేసి చక్కెర చదివింపులు చేయించారు. ఆలయం ఎదురుగా ఉన్న అగ్ని గుండంలో మొద్దులు, కట్టెలు వేశారు. అగ్ని గుండం చుట్టూ తిరిగి మొక్కులు చెల్లించుకున్నారు.

అగళి: ఆలుడి గ్రామంలో శనివారం పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బెల్లం, చెక్కర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామునే ప్రత్యేక ప్రార్థనల అనంతరం డప్పుచప్పుళ్ల మధ్య పీర్ల స్వాములతో అగ్నిగుండం ప్రవేశం చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కేసుల పరిష్కారానికి రాజీమార్గమే ఉత్తమం

- ఏడీజే కంపల్లె శైలజ


కక్షిదారులకు అవార్డు ప్రతిని అందిస్తున్న జడ్జిలు శైలజ, వెంకటేశ్వర్లు నాయక్, రమణయ్య.

హిందూపురం: కేసుల పరిష్కారానికి రాజీమార్గమే ఉత్తమమని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏడీజే కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే, సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక మెజిస్ట్రేట్ రమణయ్య నేతృత్వంలో మూడు బెంచ్‌లుగా ఏర్పాటు చేసిన మెగాలోక్ ఆదాలత్‌లో 128 కేసులను పరిష్కరించారు. ఈసందర్భంగా అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు చిన్నపాటి తగాదాలకు కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. మెగా లోక్‌ఆదాలత్‌లో 4 డెత్ కేసులు పరిష్కరించి బాధితులకు రూ.19 లక్షలు ఇప్పించారు. 5 చెక్‌బౌన్స్ కేసుల ద్వారా రూ.23,80,000 బాధితులకు అందజేశారు. అక్రమ మద్యం రవాణా కేసుల్లో ప్రభుత్వానికి రూ.3,57,700 అపరాధ రుసుం జమ చేయించారు. ఐసీఐసీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ కు హాజరైన వారందరికీ భోజన సౌకర్యం కల్పించారు. ఏపీపీలు ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు సుదర్శన్, సంతోషి కుమారి, రవిచంద్ర, రమేష్, మురళి, కళావతితోపాటు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 226 కేసుల పరిష్కారం


మాట్లాడుతున్న జడ్జి ఆర్.అశోక్ కుమార్

మడకశిరరూరల్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 226 కేసులను పరిష్కారించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కక్షిదారులు కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరగకుండా సత్వరమే కక్షిదారులకు న్యాయం అందించడానికి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడానికి రాజీమార్గమే రాజమార్గమన్నారు. అనంతరం లోక్‌అదాలత్‌లో 172 ఎక్సైజ్ కేసులను పరిష్కరించి రూ.8,40,000 జరిమానా, 25 క్రిమినల్ కేసులను పరిష్కరించి రూ.16,700 జరిమానా విధించారు. 22 ఎస్‌టీసీ కేసులను పరిష్కరించి రూ.33,500 జరిమానా, 4 బ్యాంకు కేసులు పరిష్కరించి రూ.2,95,000 బ్యాంకుకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. 2 సివిల్, ఒకటి చెక్‌బౌన్స్ కేసును పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు ఉచిత వైద్య శిబిరం

పరిగి: మండల కేంద్రంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంహెచ్‌ఈడబ్ల్యూ ట్రస్టు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న షాదీ మహల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వైద్య శిబిరం మధ్యాహ్నం 2 గంటల వరకూ కొనసాగుతుందన్నారు. అనంతపురం కిమ్స్ సవేర ఆసుపత్రి వైద్యులచే ఉచితంగా గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

రొళ్ల: రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఈనెల 2వ తేదీన కర్ణాటక రాష్ట్రం చిక్కహాలికుంటకు చెందిన నరసింహయ్య ద్విచక్ర వాహనంలో వస్తుండగా.. అదే మార్గంలో ద్విచక్ర వాహనంలో వచ్చిన హెచ్‌టీ హళ్లి చెందిన నాగరాజు ఢీకొట్టాడు. ఈ ఘటనలో నరసింహయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాదానికి కారణమైన నాగరాజుపై నరసింహయ్య కుమారుడు లక్ష్మీకాంత్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

రొళ్ల: గ్రామాల్లో ప్రధానంగా నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో వివిధ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందితో పీ–4సర్వే, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుధ్య పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు పీ–4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం వాతావరణం మార్పు వల్ల సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. డ్రైనేజీలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ శ్రీనాథ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్ అపహరణ

హిందూపురం: అంబేడ్కర్ సర్కిల్ పక్కన ఓ షాపు వద్ద బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. వివరాలు..రిటైర్డ్ ఏఎస్‌ఐ రామలింగప్ప శనివారం ఉదయం హోండా షైన్ బైక్ షాపు ముందు ఉంచి లోపలకు వెళ్లాడు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తి మాస్క్ ధరించి బైక్‌ను తీసుకెళ్లిపోయాడు. రిటైర్డ్ ఏఎస్‌ఐ బైక్ చోరీ అయిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమీపంలోని సీసీకెమెరాలో బైక్ చోరీ దృశ్యం నమోదైంది.

సీఐజీ చర్చి కార్యదర్శిగా తలారి పాల్



హిందూపురం: పట్టణంలోని సీఐజీ చర్చి కార్యదర్శిగా తలారి పాల్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా క్రిస్టియన్ సంఘాలు, పట్టణ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘ సభ్యుల సహకారంతో చర్చి అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని పాల్ పేర్కొన్నారు.

చింత చెట్ల నరికివేత

రొళ్ల: జీఎస్ పాళ్యం గ్రామంలో ఓ రైతు రెవెన్యూ, అటవీశాఖ అధికారుల అనుమతి పొందకుండా 13 చింత చెట్లను నరికి వేశాడు. తహసీల్దార్ షేక్షావలి, అటవీశాఖ సిబ్బంది తెలిపిన వివరాలు.. రత్నగిరి పొలం సర్వే నంబర్ 211/1బీలో 0.50 సెంట్లలో ఉన్న 15 ఏళ్ల వయస్సు గల 14 చింత చెట్లు ఉన్నాయి. అందులో 13 చింత చెట్లను అధికారుల అనుమతి తీసుకోకుండా నరికి వేశారు. దాసప్ప కుమారుడు అనంతరాజు పేరు మీద ఉన్న పొలంలో చింత చెట్లు నరికినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. ఆర్ఐ గిరియప్ప, వీఆర్వోలు నాగరాజు, రంగనాథ్, అటవిశాఖ ఏబీఓ సంజీవరాయుడు సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనుమతి లేకుండా నరికిన మొత్తం 13 చింత చెట్లను సీజ్ చేసి వాటికి నంబర్లు వేశారు. నరికిన చింత చెట్లను ఇతర ప్రాంతాలకు తరలించినట్లు తమ దృష్టికి వస్తే కేసు నమోదు చేస్తామని పొలం యజమానికి తెలిపారు.

ఈరగార స్వామికి పూజలు

అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామంలో శనివారం ఈరగార స్వామి విగ్రహ పునఃప్రతిష్టను పురస్కరించుకుని మండలం పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.కలశారాధన, నవగ్రహ పూజలు చేశారు. స్వామికి పంచామృతాభిషకం చేసి సహస్ర నామావళి పూజలు చేపట్టారు. అనంతరం స్వామిని పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాల నడుమ ఊరేగించారు.

జూదరుల అరెస్ట్

మడకశిరరూరల్: కల్లుమర్రి గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు సీఐ నగేష్ బాబు తెలిపారు. వారి నుంచి రూ.90,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో జూదం, మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదేవిధంగా గ్రామాల్లో రాత్రి సమయంలో కొత్త వ్యక్తులు సంచరించినా, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మె పోస్టర్ల విడుదల

పెనుకొండ: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 9న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మె కరపత్రాలను సీఐటీయూ నాయకుడు బాబావలి, రైతు సంఘం అధ్యక్షులు హరి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 10 గంటల పని సమయాన్ని సవరించుకుని 8 గంటలు అమలు చేయాలని, రవాణా కార్మికుల జీతాలు చేతికి ఇవ్వకుండా బ్యాంక్ ఖాతాలకు జమ చేయాలన్నారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. దేశ వ్యాప్త సమ్మెను కార్మిక సంఘాలు, విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బావమ్మ, వెంకటేష్, నరసింహ, శ్రీరామ, మంజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రొద్దం: మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పనిచేసి బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్తున్న ఉపాధ్యాయులకు శనివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ ఆంజనేయులునాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి,వీడ్కోలు పలికారు.